ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 19.0



ఏలూరులో ఆదివారం అర్ధరాత్రి చిన్నారుల కేరింతలు

న్యూ ఇయర్ జోష్

- కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- చర్చిలలో సందడి.. ఇంటింటా రంగవల్లులు
- పండ్లు, బొకేలు, కేకల అమ్మకాల జోరు

ఏలూరు సిటీ, జనవరి 1 : జిల్లాలో న్యూఇయర్ సందడి కనిపించింది. సోమవారం వేకువఝాము నుంచే ఏలూరు నగరంతో పాటు జిల్లాలోని అన్ని పట్టణాల్లో ఒకరినొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పుణ్య క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం, గురవాయిగూడెం మద్ది ఆంజ నేయస్వామి ఆలయం, గోకుల పారిజాతగిరి, హనుమాన్ జంక్షన్ ఆంజనేయ స్వామి ఆలయం, ఏలూరు ఆర్‌ఆర్‌పేట వెంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తుల సందడి కనిపిం చింది. క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించా రు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు ఇళ్ల వద్ద న్యూఇయర్ సందడి విశేషంగా కనిపించింది. కలెక్టర్, జేసీ, ఎస్పీ, డీఐజీలతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులకు వారి సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటాపద్మశ్రీ ప్రసాద్‌ను జడ్పీ క్యాంప్ కార్యాలయం వద్ద అధికారులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జడ్పీ ఛైర్‌పర్స న్ ఘంటా పద్మశ్రీ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపిక అందజేశారు. జిల్లా వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పాల్గొ న్నారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కేక్ కట్ చేశారు. కొత్త సంవత్సరంలో జిల్లా అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఎస్పీ మేరీప్రశాంతి, జేసీ లావణ్యవేణి, డీఎఫ్‌వో రవీందర్‌బాబు, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఐటీడీఏ పీవో సూర్యతేజ, సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, ఇతర జిల్లా అధికారులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మేరీ ప్రశాంతి కేక్ కట్ చేశారు.



ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ లావణ్యవేణి



జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎస్పీ మేరీ ప్రశాంతి, సిబ్బంది

జాతకాలు తేల్చేద్దాం





అధికార వైసీపీలో జిల్లాల వారీగా వివాదం ముదరక మునుపే, పంచాయితీ వీధిన పడక ముందే, ఆవేశకావేశాలతో కార్యకర్తలు దుందుడుకుగా వ్యవహరించక ముందే నియోజకవర్గాల వారీగా పోటీ చేసే సిట్టింగ్‌లు, ఆశా వహులపై అధిష్ఠానం తుది నిర్ణయానికి రానుంది. సమన్వయ కర్తలు సర్దుబాటు చేస్తున్నా, సీనియర్లు బుజ్జగిస్తున్నా ఇదిగో తమ బలమంటూ అధిష్ఠానం ముందు ప్రదర్శించేందుకు, ప్రాంతీయ సమన్వయ కర్తల ముందు అటో ఇటో తేల్చుకోవడానికి కేడర్ సిద్ధపడుతోంది. ఈ తరుణంలో కసరత్తు వేగంగా పూర్తి చేసి అసంతృప్తి, ఆగ్రహాలకు కొంత కళ్లెం వేయాలని అధిష్ఠా నం భావిస్తుందా అనే ప్రశ్నకు పార్టీలో అత్యధికులు అవుననే అంటున్నారు. ఇప్పటికే కొందరు సిట్టింగులను తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించి మీకు బదులుగా వేరే వారిని రంగంలోకి దింపుతాం, ఓడిపోతారని సర్వే నివేదికలతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నామని మొహం మీదే చెప్పేశారు. అయినా కొందరు సిట్టిం గులు తమ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరికొన్నిచోట్ల మార్పులు, చేర్పులంటూ పార్టీలో ప్రచారం కొనసాగుతోంది. నేడో రేపో తుది జాబితా అంటూ సంకేతాలు రావడంతో ఫ్యాను కింద ఉక్కపోత ఆరంభమైంది.

అభ్యర్థుల ఎంపికలో వైసీపీ తుది యత్నాలు

- చింతలపూడి, పోలవరంలో కొత్త ముఖాలే
- మంత్రుల నియోజకవర్గాలపైనా సంకేతాలు
- అలిగిన కేడర్‌కు మిథున్‌రెడ్డి బుజ్జగింపు
- రాద్ధాంతం పెరగక మునుపే నేడో, రేపో స్పష్టత

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

అధికార వైసీపీ నియోజకవర్గాల వారీగా మార్పులు, చేర్పులంటూ సిట్టింగులను పిలిపించి సర్దుబాటు చేద్దామనే బిగ్ ప్లాన్ బెడిసికొట్టింది. ఆ స్థానంలో అసంతృప్తి, ఆగ్రహం, పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాలనే నిగ్గు తేల్చేలా కేడర్ వ్యవహరిస్తుండడం పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది. అసెంబ్లీ స్థానాల్లో ఎవరిని తప్పించి, ఎవరికి మరోసారి అవకాశం ఇవ్వబోతున్నారో తేల్చుకునే నియోజకవర్గాల్లో గందరగోళం ఏర్పడింది. గడపగడపకు కార్యక్రమమే మీ భవిష్యత్తుకు గీటురాయి అంటూ సీఎం జగన్ తొలుత హెచ్చరించారు. ప్రతీ మూడు నెలలకోసారి దీనిపై సమీక్షించారు. ఎమ్మెల్యేలకు ప్లస్, మైనస్ పాయింట్లు వేస్తూ నివేదికలను వారి చేతికే అందించారు. గడపగడపలో వెనుకబడితే అసలు సీటే ఇవ్వబోమని గతేడాది ఆరంభంలోనే వార్నింగ్ బెల్ మోగించారు. అప్ప ట్లోనే సగం నియోజకవర్గాల్లో సిట్టింగులంతా ప్రోగ్రెస్‌ను సాధించలేకపోయారు. కొందరు నూరు శాతం పూర్తిచేసి తిరుగులేదనుకున్నారు. అలాంటి నియోజకవర్గాల్లో నరసాపురం ఒకటి. తర్వాత పార్టీ కార్యక్రమాలు విస్తృతపర్చడం, ప్రజల్లోనే ఉండాలంటూ పార్టీ ఆదేశించడంతో రెండోసారీ అనేక నియోజకవర్గాల్లో వెనుకబాటే. ఇప్పుడు అవీ ఇవీ అన్నీ కలిసొచ్చి సిట్టింగులను మార్చాలనే సర్వే నివేదికలపై వైసీపీ నాయకత్వం కుస్తీలు పడుతోంది. తొలుత చింతలపూడి, పోలవరం రిజర్వుడు నియోజక వర్గాలపై పడ్డారు. పోలవరం సిట్టింగ్ ఎమ్మెల్యే తెల్లం బాల రాజుకు మరొక మంచి 'పోస్టు' ఇస్తామంటూ చెబుతూనే ఈ సారి తప్పుకోవాలని సంకేతాలు ఇచ్చేశారు. బాలరాజు తన సతీమణి రాజ్యలక్ష్మికి ఇవ్వాలని అధిష్ఠానానికి విన్నవించారు. ఇది జరిగి పది రోజులవుతున్నా పోలవరంలో కాక తగ్గలేదు. రాజ్యలక్ష్మి టికెట్ ఖరారైందని కొంతమంది వైసీపీ కార్యకర్తలే సంబరాలు చేసుకున్నారు. మరోవైపు బుట్టాయిగూడెంకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి అశ్విని లేదా ఆ ప్రాంత స్థానిక మహిళా ప్రజా ప్రతినిధికి అవకాశం ఇస్తారా అన్న చర్చ జరుగుతోంది. కొందరు ప్రాంతీయ సమన్వయకర్త మిథున్‌రెడ్డితో ఆదివారం, సోమవారాల్లో సమావేశమయ్యారు. దీంతో ఇక బాలరాజుకు బైబై చెప్పి కీలక నిర్ణయం తీసుకునే దిశగా అధిష్ఠానం ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం.



ఇటీవల భీమవరం వచ్చినప్పుడు సీఎం జగన్‌ను కలిసిన చింతలపూడి, పోలవరం ఎమ్మెల్యేలు ఎలీజా, బాలరాజు

చింతలపూడిలో ఎలీజా అనుచరవర్గం.. తమ ఎమ్మెల్యేకే తిరిగి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పడుతున్నారు. మిథున్ రెడ్డి నివాసం ఎదుట బైఠాయింపు చేశారు. గత శుక్రవారం భీమవరానికి వచ్చిన మిథున్‌రెడ్డితో ఎమ్మెల్యే ముఖాముఖీ సంభాషించారు. అమలాపురం ఎంపీ స్థానానికి వెళ్లబోనని, ఆర్థిక స్తోమత సరిపోదని మనసులో ఉన్నదంతా వెల్లడించారు. ఈ విషయాలన్నీ సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్తానని మాట ఇచ్చినట్టు చెబుతున్నారు. ఆ తర్వాత భీమవరం పర్యటన సందర్భంగా సీఎం జగన్‌ను ఆహ్వానించే వారి జాబితాలో ఉన్న ఎలీజా సీఎంతో మాట్లాడారు. చింతలపూడి, పోలవరం ఎమ్మెల్యేలను మార్చేయడం, వెంటనే రెండు నియోజకవర్గాలకు సమన్వయకర్తలుగా పోటీ చేయబోయే అభ్యర్థులను ప్రకటించే దిశగా మూడు రోజులుగా వేగంగా కసరత్తు పూర్తి చేయగలిగారు. మంగళ, బుధవారాల్లో అధికారిక ప్రకటన చేయబోతున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఇప్పటికే చింతలపూడి ఆశావహుడిగా బ్రేక్ ఇన్‌స్పెక్టర్ విజయరాజు పట్ల పార్టీ సానుకూలంగా ఉంది. ఇప్పటికే ఆయన నియోజక వర్గ ముఖ్యులు, సీనియర్లను కలిశారు. పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే ఉద్యోగానికి రాజీనామా చేస్తానంటున్నారు.

రెండో ప్రత్యామ్నాయం ఏదీ ?

పక్షం రోజుల్లో తాడేపల్లిగూడెం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరు ప్రసాదరాజు, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే శ్రీరంగనాథ రాజుతో సీఎం, మిథున్‌రెడ్డి విడివిడిగా మాట్లాడారు. వీరంతా తాము కలిసింది నియోజకవర్గ సమస్యలపైనేనని, సీటు విష యంలో కాదని అనుచరుల వద్ద మాట దాటేస్తూ వచ్చారు. ఆచంట నుంచి తన కుమారుడికి ఈసారి అవకాశం ఇవ్వాలని రంగనాథరాజు కోరినట్టు, ఇదే సమయంలో రంగనాథరా జును పాలకొల్లుకు వెళ్లమన్నట్టు ప్రచారం జరిగింది. దీనిని అవునని గాని, కాదని గాని ఎవరూ స్పష్టం చేయడం లేదు. ఇంతకీ పాలకొల్లులో గుడాల గోపిని సమన్వయకర్తగా కొనసాగిస్తారా, లేదా అనేది రేపోమాపో తేల్చేయబోతున్నారు. మంత్రులు కారుమూరి, కొట్టు సత్యనారాయణ విషయంలో ఒక స్పష్టత రానుంది. చాలా చోట్ల సిట్టింగులను మార్చాలని సంకల్పించినా దీనికి తగ్గట్టుగా ఆయా నియోజకవర్గాల్లో పోటీకి ప్రత్యామ్నాయ అభ్యర్థులు దొరికే పరిస్థితి లేక వైసీపీ విలవిలలాడుతోంది. మంత్రులు కొట్టు, కారుమూరి తనయులు ఇంతకు మునుపు తమ తండ్రుల స్థానాల నుంచి పోటీ చేయాలని ఉత్సాహపడినా అప్పట్లో పార్టీ నాయకత్వం దీనికి అవునని, కాదని తేల్చేలేదు. వారి పోటీపైనా బలాబలాలను విశ్లేషిస్తూ సర్వేలు సాగిం చింది. కారుమూరి తణుకులో విస్తృత పర్యటనకు ప్రత్యేక కార్యక్రమం రూపొందించుకునే పనిలో పడ్డారు. రంగనాథ రాజుకు దాదాపు ఎంపీ పోటీ బెడద తప్పినట్టే. దాదాపు ఐదు గురు సిట్టింగులకు ఢోకా లేదని, తిరిగి వారే రంగంలోకి దించేందుకు సంకేతాలు ఇవ్వబోతున్నారు. ఏలూరు, భీమవరం నియోజకవర్గాల్లో ఎలాంటి మార్పు, చేర్పులు ఉండబోవని స్పష్టత ఇచ్చారు.

సడలని దీక్షతో..

ఏలూరు సిటీ, జనవరి 1 : జిల్లాలో అంగన్‌వాడీల సమ్మె సోమవారం నాటికి 21వ రోజుకు చేరింది. నూతన సంవత్సరం ఆరంభమైనా తమ సమ్మెను కొన సాగించారు. ప్రభుత్వం కళ్లు తెరిపించాలని కోరుకుంటూ ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయం తొలి మెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరులో మునిసిపల్ ఉద్యోగులతో కలసి ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీ మాగంటి బాబు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఉంగుటూరు, కుక్కునూరు, జీలుగుమిల్లి, లింగపాలెం, భీమడోలు, కామవరపుకోట, చింతలపూడి, కైకలూరు, తదితర ప్రాంతాల్లో నిరసనలు సాగాయి.



ఆర్‌ఆర్ పేటలో ర్యాలీగా వస్తున్న అంగన్‌వాడీలు,మునిసిపల్ ఉద్యోగులు

ఐజీగా అశోక్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



ఏలూరు క్రైం, జనవరి 1: ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా ఐపీఎస్ అధికారి జీవీజీ అశోక్‌కుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. డీఐజీగా వున్న ఆయనకు ఇటీవల ఐజీగా పదోన్నతి లభించింది. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూతన సంవత్సరం సందర్భంగా ఏలూరులోని తన కార్యాలయంలో కేక్ కట్ చేశారు. రేంజ్‌లోని ప్రజలకు, పోలీస్ సిబ్బంది అందిరికి శాంతి, శ్రేయస్సు, సంతోషం, ఉల్లాసం అందించాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను కలిసి పలువురు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మూడు రోజులు.. రూ.16 కోట్లు!

- జిల్లాలో భారీగా మద్యం అమ్మకాలు
- నూతన సంవత్సర వేడుకల పేరిట మద్యం ప్రియుల జోరు



ఏలూరు క్రైం, జనవరి 1 : జిల్లాలో మద్యం ప్రియు లు తమ ఆనందాన్ని మద్యం తాగడంలో చూపించారు. 2023 డిసెంబరు 30, 31వ తేదీ, ఈ ఏడాది 1వ తేదీన వారి ఆనందానికి అవధులే లేకుండా పోయింది. నూతన సంవత్సర వేడుకలు దగ్గర అవుతున్న సమయంలో 30వ తేదీ నుంచి మద్యం షాపులు, బార్లు, లిక్కర్ స్టోర్స్‌లో రద్దీ ఎక్కువైంది. జిల్లాలో 140 మద్యం షాపులు, 16 బార్లు, 12 వాకిన్ స్టోర్స్ ఉన్నాయి. వీటికి నిడమనూరు, భీమవరం, గొల్లపూడి, ఏలూరు, చాగల్లు, గుడివాడ లిక్కర్ డిపోల నుంచి జిల్లాలో షాపులు, బార్లకు మద్యం సరఫరా అవుతుంది. రోజుకు సగటున రెండు కోట్ల 70 లక్షల రూపాయల మద్యం విక్రయాలు జరుగుతుండేవి. అయితే నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో డిసెంబరు 30న నాలుగు కోట్ల రూపాయల మద్యం విక్రయాలు జరుగగా, 31న రూ.ఆరు కోట్ల మద్యం, జనవరి 1వ తేదీన ఆరున్నర కోట్ల రూపాయల మద్యం విక్రయాలు జరిగాయి. మొత్తంగా మూడు రోజుల్లో మద్యం ప్రియులు ఏకంగా పదహారున్నర కోట్ల రూపాయల మద్యాన్ని తాగేశారు.



పాలకోడేరులో పరిశీలిస్తున్న జాస్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ విజయలక్ష్మీ, డీఎం హెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు

నేటి నుంచి జగనన్న సురక్ష-2 ప్రారంభం

భీమవరం, /పాలకోడేరు, జనవరి 1 : ప్రభుత్వం రెండోదఫా జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమం ఈనెల 2వ నుంచి ప్రారంభమవుతుందని జూన్ వరకు 502 క్యాంపులు, గ్రామ ఆరోగ్య క్లినిక్‌లు నిర్వహించాలని రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం జిల్లా నోడల్ ఆఫీసర్లతో ఆమె సమీక్షించారు. హెల్త్‌క్యాంపులు నిర్వహించే ముందు రోజు అన్ని వసతులు, మందులు, ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్ల వివరాలు సరిచూసుకోవలసిన బాధ్యత సంబంధిత వైద్యాధికారి, సూపర్‌వైజర్లదేనని చెప్పారు. వలంటీర్లు, ఆశా కార్యకర్తలు ముందుగానే ఇంటింటా సర్వే నిర్వహించి వైద్య అవసరాలున్న ప్రజలను గుర్తించి క్యాంపులలో వైద్యసేవలందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మహేశ్వర రావు, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి భాను నాయక్, జిల్లా నోడల్ ఆఫీసర్ ప్రసాద్, ఇమ్యునైజేషన్ అధికారి సుధాలక్ష్మి, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ కీర్తి కిరణ్ పాల్గొన్నారు. పాలకోడేరులో బుధవారం నిర్వహించనున్న శిబిరం ఏర్పాట్లను సోమవారం రాత్రి విజయలక్ష్మి పరిశీలించారు.

నేడు మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

దెందులూరు, జనవరి 1 : ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం పరిధిలోని ఐదు జిల్లాలోని కాలేజీల మహిళా క్రికెట్ క్రీడాకారుల ఎంపిక దెందులూరు మండలం గోపన్నపాలెం శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో మంగళవారం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానయాల్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు కోయంబత్తూర్‌లో జరిగే సౌత్ ఇండియా అంతర విశ్వ విద్యాలయ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.



డీవైఎఫ్ఐ సంక్రాంతి యువజనోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న సభ్యులు

జనవరి 9 నుంచి సంక్రాంతి యువజనోత్సవాలు

ఆకివీడు, జనవరి 1: పండుగ సమయాల్లో కోడి పందాలు, జూద క్రీడలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ సంక్రాంతి యువజనోత్సవాల నిర్వహణ కమిటీ క న్వీనర్ డోకల రవితేజ, ఆహ్వాన సంఘం కోశాధికారి బి.రాంబాబు అన్నారు. సోమ వారం ఆకివీడులో వారు విలేకరులతో మాట్లాడారు. డీవైఎఫ్ఐ 41వ సంక్రాంతి యువజనోత్సవాలు ఈనెల 9 నుంచి 17 వరకు దుంపగడప కళాశాల, ఆకివీడు జడ్పీ బాలురున్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. యువత చెడు వ్యసనాలు వైపు పోకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. యువజనో త్సవాలకు సుమారు 800 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కమిటీ సభ్యులు తవిటినాయుడు, సూరిబాబు, బొక్కా వర్మ, గేదెల రాము తదితరులు ఉన్నారు.

కేంద్ర మత్స్యశాఖ మంత్రి నేడు భీమవరం రాక

భీమవరం, జనవరి 1 : కేంద్ర మత్స్యశాఖ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా ఈనెల 2న భీమవరం రానున్నట్లు జిల్లా సమాచార శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.మంగళవారం సాయంత్రం 4 గంట లకు మచిలీపట్నం నుంచి రోడ్డు మార్గంలో సాయంత్రం 5-30 గంటలకు భీమవరం చేరుకుంటారు. సాయంత్రం 5-30 నుంచి 7-30 గంటల వరకు జిల్లాలోని ఆక్వా రైతులతో, ప్రాసెసింగ్ ప్లాంట్స్ ఆపరేటర్లతో ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించే సమావేశానికి హాజరవుతారు. రాత్రి భీమవరంలో బస చేసి, మూడో తేదీ ఉదయం బయలుదేరి కోనసీమ జిల్లా అంతర్వేదిపాలెం వెళతారని తెలిపారు.

మహిళకు అరుదైన శస్త్ర చికిత్స



తణుకు, జనవరి 1 : తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్న మహిళకు తణుకు సాయిశ్వేత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. గణపవరం మండలం కాశిపాడు గ్రామానికి చెందిన పాలూరి నిర్మల తీవ్రమైన కడునొప్పితో ఆసు పత్రి వైద్యులను సంప్రదించగా ఎమర్జెన్సీ విభాగంలో పరీక్షలు చేసి కడుపులో కణితి ఉందని గుర్తించి వైద్యులు తక్షణమే శస్త్ర చికిత్స చేసి ఆమె కడుపులోని పదికేజీలు కణితి తొలగించారు. మహిళల్లో ఈ సమస్య ఉత్పన్నం అవుతుందని, దీనిని టోర్సన్ ఒవేరియన్ సిస్ట్ అంటారని, అండాశయ తిత్తి పెద్దదిగా మారినపుడు రక్తసరఫరా లేక అండాశయం చుట్టూ మెలితిప్పినట్లు చేస్తుందని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్సలో ఆసుపత్రి జనరల్ సర్జన్ డాక్టర్ నిమ్మల సత్యనారాయణ, డాక్టర్లు చీర్ల నారాయణరావు, చీర్ల ఉషారాణి, బాలాజీ పాల్గొన్నారు.



కలహాల కాపురాలు



మూడు ముళ్ల బంధం మూడేళ్లు గడవకుండానే ముగిసి పోతోంది. పెళ్ళినాట ఏడడుగులు వేసిన జంటలు ఏడేళ్లు కూడా కలసి నడవలేకపోతున్నారు. నాతిచరామి అంటూ జీవితాంతం కష్టమైనా, సుఖమైనా, మంచైనా, చెడైనా కలసి నడుస్తానంటూ భర్త చేసిన తొలి వాగ్దానం తెల్లారి పోతోంది. లేనిపోని మనస్పర్థలతో విడిపోవడానికి కొత్త జంటలు సిద్ధపడుతున్నారు. సర్దుకుపోని మనస్తత్వం, అహంకారంతో వివాహ బంధానికి విలువ లేకుండా చేస్తున్నారు.

- నిడమర్రు

- భార్యాభర్తల మధ్య పెరుగుతున్న మనస్పర్థలు
- అహంకారంతో విభేదాలు..సర్దుకుపోని తత్వం
- అగమ్యగోచరంగా పిల్లల భవిష్యత్తు
- ఖర్చుకు వెనుకాడని యువ జంటలు
- ఆర్థిక సమస్యలతో మనోవేదన

పెళ్లిళ్లలో గొడవలతో ప్రారంభం

ఇటీవల కాలంలో పెళ్లిళ్లలో పెట్టిపోతలు, వియ్యాలవారి ఆతిథ్యం విష యంలో కుటుంబాల మధ్య గొడవలు మొదలవుతున్నాయి. మా వాళ్లను పెళ్లిలో మీవాళ్లు సరిగా పలకరించలేదని, ఆతిథ్యం సరిగా ఇవ్వలేదని కుటుంబ పెద్దలు, ఆడవాళ్ళు నిందలు వేసుకొంటూ గొడవలు పెట్టుకొంటున్నారు. పెళ్లిలో భోజనాలు సరిగా పెట్టలేదంటూ మొగుడు పెళ్ళాల మధ్య గొడవలు వచ్చేలా సమస్యలు సృష్టిస్తున్నారు.

అహంకారం.. అభిప్రాయ విభేదాలు

కాళ్ల పారాణి ఆరకముందే దంపతుల్లో ఒకరి అభిప్రాయాలు మరొకరికి నచ్చక మనస్పర్ధలు పెంచుకొంటున్నారు. అవగాహన లేమితో అభిరుచులు, కోరికలు తేడాలు చూపిస్తూ గొడవలు సృష్టించుకొంటున్నారు. నా ఇష్టాలను గౌరవించడం లేదని భార్య, నన్ను గౌరవించడం లేదని భర్త అలిగి దూరమ వుతున్నారు. బాగా చదువుకొన్నానన్న అహంకారం..నువ్వు చెప్పేది నేను వినా ల్సిన అవసరం నాకేంటి ? నా సంపాదన నా ఇష్టం ? అనే మాటలు కొత్త దంపతుల మధ్య ఎక్కువగా వినపడుతున్నాయి. సర్దుకుపోని మనస్తత్వం వల్ల గొడవలు పెరిగి చివరకు విడిపోవడానికి సిద్ధపడుతున్నారు. రాజీలేని సంసారం ముందుకు సాగదన్న పెద్దలమాటను పెడచెవిన పెడుతున్నారు.



అర్థం చేసుకోలేని ప్రేమ వివాహాలు

యుక్త వయసులో ఇష్టపడి ప్రేమ వివాహాలు చేసుకొంటున్నారు. వివాహం చేసుకొనేవరకు ఎంతో ప్రేమగా ఉండే ఈ జంటలు తీరా పెళ్లి చేసుకొన్నాక ఒకరినొకరు అర్థం చేసుకోలేకపోతున్నారు. చిన్న విషయానికి కూడా అపార్థం చేసుకొంటున్నారు. ప్రేమ వివాహాలలో పెద్దల సపోర్టు లేకపోవడంతో వీరికి నచ్చచెప్పేవారు కూడా లేకుండా పోతున్నారు.

కట్నం వేధింపులు

పెద్దల కుదిర్చిన సంబంధాలలో విభేదాలకు వరకట్నం ప్రధాన కారణ మవుతోంది. కట్నకానుకుల విషయంలో ఇటీవల కాలంలో ధనిక కుటుంబాలలో కొంత ఒత్తిడి తగ్గినా పల్లెల్లో మాత్రం ఇంకా కట్నాల పట్టింపులు ఎక్కువగా ఉన్నాయి.అడిగినంతా కట్నం ఇచ్చుకోలేక ఆడపిల్లల తండ్రులు ఎన్నో ఇబ్బం దులు పడుతున్నారు. అత్తవారింట్లో ఆడపిల్లకు వరకట్నం కోసం వేధింపులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇటీవల ఉద్యోగాల ఒత్తిడిలో గడుపుతూ సంసారాలకు దూరం అవుతున్నారు. కాలం గడిచేకొద్ది పిల్లల పుట్టడం లేదంటూ నిందలు వేసుకొంటూ విడిపోతున్నారు.

దూరం చేస్తున్న వ్యసనాలు

పెళ్లికి ముందు మా కుర్రోడు చాలామంచోడంటూ పెళ్లి చేస్తున్నారు. తీరా పెళ్లయ్యాక అతని అలవాట్లు తెలిసి ఆడపిల్లవారు బిత్తరపోవాల్సిన పరిస్థితి ఉంటోంది. ప్రతిరోజు తాగి ఇంటికి వచ్చే భర్త ఆగడాలు భరించలేక ఆడ పిల్లలు పుట్టింటికి పరుగులు పెడుతున్నారు. గొడవలు పడి సంబంధాలు తెంచుకొంటున్నారు. ఉద్యోగాల పేరుతో బయటకు వస్తున్న భార్యభర్తలు ఉద్యోగ ప్రాంగణంలో వేరేకరితో ఏర్పడిన పరిచయాలు వివాహేతర సం బంధాలకు దారితీస్తున్నాయి. దీంతో కాపురాలు కూలుతున్నాయి.

పెరుగుతున్న ఆర్థిక సమస్యలు

కొత్తజంటలు ఖర్చుకు వెనకాడడం లేదు. రెండు చేతులా సంపాదిస్తున్నాం మా ఇష్టం అంటూ ఆర్థిక సమతుల్యం లేకుండా ఖర్చుచేస్తుండడంతో చివరకు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. కార్పరేట్ ఉద్యోగాల ఒక్కసారిగా పింక్ కార్డుతో చెల్లుచీటి ఇవ్వడంతో ఈఎంఐల భారంతో ఘర్షణలు పెరగు తున్నాయి. ఇటు వ్యవసాయం, వ్యాపారం, ఆక్వా రంగాలు కూడా పూర్తి దెబ్బ తినడంతో ఆర్థిక సమస్యలతో నలిగిపోయి దూరమవుతున్నారు.

అగమ్యగోచరంగా పిల్లల భవిష్యత్తు

తమ అహంభావంతో పచ్చని కాపురంలో చిచ్చులు పెట్టుకొంటూ సం సారాన్ని పాడుచేసుకొంటున్నారు. వీరి చేస్తున్న తప్పులు వారి పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. విడిపోయిన భార్యభర్తలు తమ సంతానం విషయంలో వంతులు వేసుకొని ఆ బిడ్డలకు తండ్రినో, లేక తల్లినో లేకుండా చేస్తున్నారు. అమ్మమ్మ, నాయనమ్మల వద్ద పెరుగుతూ తల్లిదండ్రుల ప్రేమలకు దూరమవు తున్నారు. వారి చదువుల విషయంలో సరైన నిర్ణయాలు చేయక తమతో పాటు పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్నారు.

చంద్రబాబుకు శుభాకాంక్షలు



భీమవరం టౌన్, జనవరి 1 : పశ్చిమ గోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి సోమవారం చంద్ర బాబునాయుడును హైదరాబాదులోని ఆయన నివాసంలో సోమవారం కలిసి పుష్పగుచ్ఛంతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెతో పాటు కుమార్తె, నీలోఫర్ హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి శుభాకాంక్షలు తెలియజేశారు.

రేపటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు



భీమవరం టౌన్, జనవరి 1 : త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వ ర్యంలో ఈనెల 3నుంచి 8వ తేదీ వరకు 105వ త్యాగరాజ ఆరాధ నోత్సవాలు, త్యాగరాజ స్వామి 176 వర్ధంతి కార్యక్రమాలను నిర్వహి స్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి, కారు మూరి చినబాబు తెలిపారు. 3 ఉదయం 8-30 గంటలకు స్వామివారి ఊరేగింపు, సాయంత్రం 6-30 నిమిషాలకు సురేంద్రనాథ్ బృందం నృత్యంతో ఉత్సవాలు ప్రారంభమ వుతాయి. 6న ఉదయం 10 గంటలకు శ్రీత్యాగరాజ స్వామివారి పంచరత్న కీర్తనలు, సాయంత్రం 6-30 గంటలకు బెంగళూరు బ్రదర్స్‌వారిచే గాత్రం, 7న జంధ్యాల కృష్ణకుమారి బృందం హరికథ, 8న పోపూరి గౌరినాథ్ బృందం పాహిరామప్రభో సంగీత రూపకం నిర్వహి స్తున్నట్లు తెలిపారు. హైదరా బాద్, బెంగళూరు విశాఖపట్నం, చెన్నై నుంచి సంగీత విద్వాంసులు వస్తున్నారని తెలిపారు.

ఆలయాలకు భక్తుల తాకిడి

ద్వారకాతిరుమలలో రద్దీ

ద్వారకాతిరుమల, జనవరి 1: ద్వారకాతిరుమల ఆలయం న్యూ ఇయర్ సందర్భంగా జిల్లాలోని వివిధ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రసిద్ధ ఆలయాల భక్తులతో కళకళలాడాయి పురస్కరించుకుని సోమవారం భక్తు లతో కిటకిట లాడింది. నూతన సంవత్సరం తొలిరోజున స్వామిని దర్శించా లన్న ఆకాంక్షతో ఆది వారం సాయంత్రానికే ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాదయాత్రగా విచ్చేశారు. తెల్లవారుజాము నుంచి వచ్చిన భక్తులతో క్షేత్రంలో సందడి నెలకొంది. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో నిండాయి.

నేత్రపర్వం..ధనుర్మాస ఉత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత గోదాదేవితో కలసి చిన వెంకన్న తొళక్కవాహనంపై సోమవారం ఉదయం క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని ముందుగా ఆలయ ఆవరణలో తొళక్కం వాహనంపై శ్రీవారు, అమ్మవార్లతో పాటు గోదాదేవి ఉత్సవ మూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక అలంకరణ చేశారు. మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.క్షేత్ర తిరువీధుల్లో ప్రత్యేక అలంకరణలో ఉన్న గజలక్ష్మిని సందర్శించిన భక్తులు దానికి పళ్లు, చెరకు ముక్కలు అందించి ఆశీర్వాదం పొందారు.

భీమవరం మావుళ్ళమ్మ ఆలయం కిటకిట

భీమవరం టౌన్ : కొత్త సంవత్సరం అంతా శుభాలు కలగాలని కోరు కుంటూ పట్టణంలో భక్తులు మావుళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకోవటానికి



తిరువీధుల్లో శ్రీవారు, అమ్మవార్ల గ్రామోత్సవం

రావటంతో ఉదయం నుంచీ ఆలయం కిటకిటలాడింది. ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రద్దీ కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఈవో భద్రాజీ పర్యవేక్షించారు. సోమేశ్వరస్వామి ఆలయం, సోమేశ్వరస్వామి, దాసాంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కళకళాడాయి.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో..



పాలకొల్లు టౌన్ : క్షీరారామంలో సోమవారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచీ భక్తులు క్యూకట్టి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఛైర్మెన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్య నారాయణ ఏర్పాట్లును పర్యవేక్షించారు.

ఏలూరులో హత్య..మృతుని గుర్తింపు

ఏలూరు క్రైం, జనవరి 1 : ఏలూరు నగరంలో పాత బస్టాండ్ సమీపంలో డిసెంబర్ 31వతేదీ అర్ధరాత్రి జరిగిన హత్యలో మృతుడిని గుర్తించారు. ఏలూరు కత్తేపువీధి ప్రాంతానికి చెందిన ఒడ్డిగళ్ళ మధు (30) బార్బర్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. అతని భార్యతో గొడవ జరిగి ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్నాడు. ఏలూరు బావిశెట్టివారిపేటనకు చెందిన పెయింటర్ కనుమటి హరికుమార్ (35)తో అప్పుడప్పుడు కలిసి మద్యం తాగుతూ ఉంటాడు. వీరిద్దరు డిసెంబరు 31 రాత్రి ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోని ఒక బార్‌లోకి వెళ్లి మద్యం తాగుతూ ఉండగా వారి మధ్య గొడవ జరిగింది. ఇంటికి వెళ్తున్న మధుపై హరికుమార్ చాకుతో దాడి చేసి హతమార్చాడు. ఈ ఘటనపై టూటౌన్ సీఐ ప్రభాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

యలమంచిలిలో ఇంట్లో చోరీ

యలమంచిలి, జనవరి 1: యలమంచిలి గ్రామం గొలేపరచెరువు గట్టు ప్రాం తంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. గొలేపరచెరువు గట్టు ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కవురు విష్ణుమూర్తి తన ఇంటికి తాళం వేసి పెనుగొండ మండలంలో ఉన్న తన కుమార్తె ఇంటికి రెండు రోజుల క్రితం వెళ్లారు. అప్పటి నుంచి ఇంట్లో ఎవరూ లేరు. ఆ ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉండటాన్ని ఇరుగు పొరుగువారు సోమవారం ఉదయం గమనించారు. ఫోన్‌లో విష్ణుమూర్తికి సమాచారం అందించారు. దీంతో చోరీ ఎప్పుడు జరిగిందో తెలియదు కానీ సోమ వారం విషయం బయటపడింది. భారీగా బంగారం, నగదు అపహరణకు గురైనట్టు సమాచారం.

న్యూ ఇయర్ విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

నూతన సంవత్సర వేడుకలు ఆ కుటుంబాల్లో తీరని విషాదం నింపాయి.. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు మృతిచెందారు.



రోడ్డు పక్కన ఉన్న సిమెంటు దిమ్మను ఢీకొన్న మోటారు సైకిల్

ఏలూరులో మోటారు సైకిల్ అదుపుతప్పి.. ఇద్దరు యువకుల మృతి

ఏలూరు క్రైం, జనవరి 1 : హైస్పీడ్ మోటారు బైక్‌పై అర్ధరాత్రి వేళ అతి వేగంగా వెళుతూ రోడ్డు పక్కనే సిమెంటు దిమ్మను ఢీకొట్టిన ప్రమా దంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఏలూరు కుమ్మర రేవుకు చెందిన తేళ్ళ వెంకట సుబ్రమణ్యం (17) ఇంటర్మీడియట్ చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. అతని స్నేహితుడైన ఏలూరు కొత్తపేటకు చెందిన మీసాల వేణుసాయి మాధవ్ (17) బీటెక్ చదువుతున్నాడు. వీరిద్దరు డిసెంబరు 31 రాత్రి మోటారు సైకిల్‌పై ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో నూతన సంవత్సర వేడుకలను జరుపుకుని అక్కడ నుంచి వట్లూరు హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్తూ మినీ బైపాస్ రోడ్డులో పక్కనే హెచ్చరికగా ఉన్న సిమెంటు దిమ్మను ఢీకొట్టారు. దీంతో ఆ దిమ్మ విరిగి పోయింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలవగా విజయవాడ తీసుకు వెళ్ళారు. అక్కడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందు తున్న సుబ్రహ్మణ్యం మధ్యాహ్నం మృతి చెందగా, ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మాధవ్ మృతి చెందాడు. నూతన సంవత్సర వేడుకలు ఆ రెండు కుటుంబాలకు తీరని విషాదాన్ని నింపింది. ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్..ఒకరి మృతి..





దెందులూరు, జనవరి 1 : నూతన సంవత్సరం మొదటి రోజు విషాదం నెలకొంది. 16వ నంబరు జాతీయ రహ దారిపై జరిగిన రోడ్డు ప్రమా దంలో యువకుడు మృతి చెందాడు. ఇద్దరికి తీవ్రగా యాల య్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో భీమడోలు మండలం గుండుగొలను గ్రామా నికి చెందిన గంటా బాలు (18) మరో ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై జాతీయ రహదారి మీదుగా దెందులూరు వైపు వెళ్తున్నారు. మోటార్ సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో బాలు అక్కడిక్కడే పడి మృతి చెందాడు. మరో ఇద్దరు నత్తా వంశీ, కొవ్వలి సురేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయ పడిన వారిని స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. దెందు లూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెంటపాడులో పంటబోదెలో పడి ఒకరు..



పెంటపాడు, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకలను స్నేహితులతో కలసి చేసుకునేం దుకు వచ్చిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెం దాడు. భీమడోలు మండలం వడ్లపట్ల గ్రామానికి చెందిన భీమవరపు రామకృష్ణ (33) వ్యవసాయ కూ లీగా జీవనం సాగిస్తున్నాడు. నూతన సంవత్సరం వేడుకల కోసం ఆదివారం సాయంత్రం పెంటపాడు మండలం కే.పెంటపాడులో ఉన్న తన స్నేహితు లను కలిసేందుకు వచ్చాడు. రాత్రి మోటర్ సైకిల్‌పై తన స్వగ్రామం వెళ్తున్న సమయంలో పెంటపాడు మూలతూం వద్ద ఉన్న కల్వర్ట్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న పంటబోదెలో పడిపోయాడు. తలకు బలమైన గాయం అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పోలీ సులు తెలిపారు. ఎస్.ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్





బావిలోకి దూసుకెళ్లిన బుల్లెట్.. ఇద్దరు దుర్మరణం

ఆగిరిపల్లి, జనవరి 1: విజయవాడలోని నున్నకు చెందిన శెట్టి సాయి కుమార్, నున్న రాకేష్ స్నేహితులు. నూతన సంవత్సరం సందర్భంగా రాకేష్ సమీప బంధువు అయిన ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం కనసానపల్లిలో వేడుకలు జరుపు కునేందుకు తమతో పాటు విజయవాడ మొగల్రాజపురానికి చెందిన తలశిల కృష్ణచైతన్యను తీసుకువెళ్లారు.పార్టీ అనంతరం సోమవారం ఉదయం ఇళ్లకు బయల్దేరారు. బుల్లెట్‌పై వెళు తున్న వీరికి గేదెలు అడ్డు రావడంతో పక్కకు వెళ్ళేప్రయత్నంలో పక్కనే ఉన్న నేలబావిలోకి వీరి బైక్ దూసుకు పోయింది. వీరి వెనుకే వస్తున్న మరో ఇద్దరు ఇది చూసి పొలంలో పనిచేస్తున్న వారికి సమాచారం ఇవ్వడంతో వారు కర్ర సాయంతో రాకేష్‌ను బావి నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కృష్ణచైతన్య (24), శెట్టి సాయికుమార్ (24) బావిలోనే మృతి చెందారు. పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాలను బయటకు తీయించారు. ఎస్సై చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయికుమార్, కృష్ణచైతన్య ఇప్పుడిప్పుడే ఉద్యోగాల్లో స్థిరపడుతూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు.వీరిని నేలబావి పొట్టన పెట్టుకోవడంతో వారి తల్లిదండ్రుల ఆవేదనకు అంతులేదు.

వైద్య ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

లింగపాలెం, జనవరి 1: లింగపాలెంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్ఎన్‌వోగా పని చేస్తున్న రాజేశ్వరి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సోమవారం ఉదయం విధులకు హాజరైన ఆమె ఆసుపత్రిలోనే అపస్మారక స్థితిలోకి వెళ్ళ డంతో గుర్తించిన సిబ్బంది ఆమెకు ప్రాథమిక చికిత్స జరిపి చింతలపూడిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యసేవల నిమిత్తం ఏలూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జిల్లాను మరింత సుసంపన్నం చేద్దాం : జేసీ


కేక్ కట్ చేస్తున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు కలెక్టరేట్ : జిల్లాను మరింత సుసంపన్నం చేసేందుకు కలసి కట్టుగా కృషి చేద్దామని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా జేసీ క్యాంపు కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేశారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగసంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మరింత ఉన్నత సేవలందించాలి : ఎస్పీ


నూతన సంవత్సర వేడుకల్లో ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మేరీ ప్రశాంతి సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ 2023 సంవత్సరంలో పోలీస్ సిబ్బంది సాధించిన ప్రగతి కంటే ఉన్నతమైన సేవలను ప్రజలకు అందించాలన్నారు. జిల్లా ప్రజలు, పోలీస్ సిబ్బంది అందరు సుఖ సంతోషాలతో నూతన సంవత్సరంలో వర్ధిల్లాలని ఆమె కోరారు. జిల్లాలో పని చేస్తున్న పలువురు పోలీసు అధికారులు ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జనంలోకి భవిష్యత్ గ్యారెంటీ


సమావేశంలో మాట్లాడుతున్న ఘంటా మురళి

కామవరపుకోట, జనవరి 1: తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ జనంలోకి బాగా వెళ్లిందని, ఎక్కువ కుటుంబాలను కలుసుకుని పార్టీ విధానాలను, హామీలను వివరించినట్లు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ తెలిపారు. టీడీపీ శ్రేణులతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. తొలి విడతలోనే 6వేల కుటుంబాలను కలుసుకుని పార్టీ విధానాలను తెలియచేయడంతో ప్రజల్లో నూతనోత్సాహం వచ్చిందని చెప్పారు. ఇదే స్ఫూర్తి ఎన్నికలు ముగిసే వరకు కొనసాగించాలన్నారు. నాయకులు తూతా లక్ష్మణరావు, వజీర్‌ఖాన్, బొబ్బిలి డాన్ దివాకర్, పసుమర్తి పార్థసారధిబాబు, వేముల నాగేశ్వరరావు, గూడపాటి కేశవరావు, జిజ్జూరి బాబ్జీ, గోరింక దాసు, వేముల హనుమంతు, డోలా విజయ్, పర్సా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు, విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ


కుట్టు మిషన్లు అందజేస్తున్న లయన్స్ ప్రతినిధులు

కామవరపుకోట, జనవరి 1 : గుంటుపల్లి పంచాయతీలోని జీలకర్రగూడెం బౌద్ధారామాల గుహల వద్ద సోమవారం లయన్స్ క్లబ్ సమావేశాన్ని నిర్వహించారు. కుట్టు శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు, విద్యార్థులకు సైకిళ్లు, పాఠశాలకు బీరువాలు పంపిణీ చేశారు. జోనల్ చైర్మన్ ఆర్.ఆర్.రత్నకుమారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, జీలకర్రగూడెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్ఆర్ఆర్.యర్రంరాజు, ఉపాధ్యక్షులు కాకర్ల వేణుబాబు, పాపారావు నాయుడు, పలు ప్రాంతాల లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.

ఆర్ఆర్ పేట శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో విశేష పూజలు


కలశాల వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 1: ఆర్ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కలశాల వద్ద కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పూజలు చేశారు. స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. రామచంద్రన్ శిష్య బృందం కర్నాటక శాస్త్రీయ సంగీత విభావరిని నిర్వహించి కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ఈవో నాగం సన్యాసిరావు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. భక్తులతో ఆలయ ప్రాంతం కిటకిటలాడింది.

నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 1: శివనగర్‌లోని భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయం వద్ద సోమవారం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం నందీశ్వరునికి పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు వెంకటరత్నం శర్మ భక్తులతో పూజలు చేయించారు. భ్రమరాంబికా దేవి అమ్మవారికి కుంకు మార్చన నిర్వహించారు. నూతన సంవత్సరం ప్రారంభం కావడం పంచమి తిథి, సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కివ్వాక చేరుకున్న అయోధ్య రాముడి అక్షింతలు

కుక్కునూరు, జనవరి 1: మండల పరిధిలోని కివ్వాక రామాలయానికి అయోధ్య రాముడి అక్షింతలు చేరుకున్నాయి. ఈ క్రమంలో భక్తులకు అక్షింతలు పంపిణీ చేయడానికి ప్యాకెట్‌లుగా సిద్ధం చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికి అక్షింతలు పంపిణీ చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


దుగ్గిరాలలోని చింతమనేని క్యాంప్ కార్యాలయంలో సందడి


భీమడోలులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు


దుద్దుకూరులో ఎమ్మెల్యే బాలరాజుకు డీఎస్పీ శుభాకాంక్షలు


కొండలరావుపాలెంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు

నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజా ప్రతినిధులు, నేతలు, అధికారుల ఇళ్ల వద్ద సందడి

ఏలూరు రూరల్, జనవరి 1: జిల్లాలో నూతన సంవత్స వేడుకలు సోమవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రజలు పెద్దసంఖ్యలో ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాజకీయ నాయకులు, అధికారుల ఇళ్ల వద్ద హడావుడి నెలకొంది. ఉదయం నుంచే ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది బొకేలు, కేక్‌లు ఇతర బహుమతులతో కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని ఇంటివద్దకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, జిల్లా ఉన్నతాధికారులు చేరుకున్నారు. పూలమాలలు, బొకేలు, పండ్లు శాలువాలతో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. నగరంలోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఏసుక్రీస్తును ఆరాధించారు. కేక్‌లు కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

● ఏలూరు టూటౌన్: బడేటిక్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి భారీ కేక్ కట్ చేశారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు వందలాదిగా వచ్చిన చంటికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ రైతు సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ ఆవిష్కరించారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న రైతు సంఘం నాయకులను అభినందించారు.

● ఏలూరు కార్పొరేషన్: జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు కేక్ కట్ చేశారు. జనసేన నాయకులు, కార్యకర్తలు పార్టీ పురోభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. నగిరెడ్డి కాశీ నరేష్, బొత్సమధు, వీరంకి పండు, బోండా రామునాయుడు, శ్రావణగుప్త, కందుకూరి ఈశ్వరరావు, నిమ్మల శ్రీను తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు దండుబోయిన చంద్రశేఖర్, ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, ఉప్పు మురళీకృష్ణ, సేవాదళ్ సుబ్బారావు, సతీష్ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణం, మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచే న్యూ ఇయర్ సంబరాల్లో యువతంతా నిమగ్నమయ్యారు. బిర్యానీ, మద్యం దుకాణాలు, కేక్, స్వీట్, ఫ్రూట్ దుకాణాలు కిటకిటలాడాయి. పలువురు రాజకీయ పార్టీ నేతలు అభిమానుల మధ్య సోమవారం కేక్ కట్ చేశారు.

టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీనివాసపురంలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహిం చారు. ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు, కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, కొండ్రు దేవా, పల్లి శ్రీను, గొల్లమందల శ్రీనివాస్ తదితరులతో కలసి దాసరి శేషు కేక్ కట్ చేశారు. గుల్లపూడి శ్రీదేవి, తూటికుంట రాము, తదితరులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామ్‌కుమార్ నివాసంలో నూతన సంవత్సర కేక్ కట్ చేశారు. భారీగా టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: నూతన సంవత్సర ఆరంభంలో చర్చిలు, ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పోలవరం డీఎస్పీ రత్నరాజు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది దుద్దుకూరులో ఎమ్మెల్యే తెల్లం బాలరాజును కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. బుట్టాయగూడెంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబును నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కన్వీనర్ బొరగం శ్రీనివాస్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. రాజానగరంలో మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్ నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు.

● టి.నరసాపురం: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అప్పలరాజుగూడెం, మక్కినవారిగూడెం, మర్రిగూడెం, పుట్రేవు, ప్రకాష్ నగర్, టి.నరసాపురం, బొర్రంపాలెం, కె.జగ్గవరం తదితర గ్రామాల్లో స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. టీడీపీ నాయకులు కేక్‌లు కట్ చేశారు. తిరుమదేవీపేటలో తోట లక్ష్మీనారాయణ, కె.జగ్గవరంలో జయవరపు శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో న్యూ ఇయర్ కేక్‌ను కట్ చేసి విందు ఏర్పాటు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, భిక్షమయ్య, అద్దంకి జగన్మోహనరావు, కాల్నీడి రాంబాబు, కోరుకొండ వెంకటభద్రం, తోట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉంగుటూరు భద్రకాళి అమ్మవారిని భవానీ మాలధారులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు జరిపారు. గ్రామాలలో ఇళ్ల ముందు ముగ్గులు, గొబ్బిళ్లతో అలంకరించారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో శుభాకాంక్షలు మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. నూతన సంవత్సరంలో అందరూ సంతోషంగా ఉండాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. జనసేన, తెలుగుదేశం కార్యకర్తలు ధర్మరాజును కలసి శుభాకాంక్షలు తెలిపారు. గణపవరం, నిడమర్రు, భీమడోలు, ఉంగుటూరు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

● పెదవేగి: దుగ్గిరాలలో క్యాంపు కార్యాలయంలో మాజీఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కేక్‌కట్ చేశారు. ఈ ఏడాది ప్రజలకు మేలు చేసే విధంగా ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు చెప్పారు. కొండలరావుపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొఠారు అబ్బయ్యచౌదరి కేక్ కట్‌చేసి, వేడుకలను జరిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులకు అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నాయకుల ఇళ్ల వద్ద వేడుకలు జరిగాయి. అధికారులు తమ తమ ఉన్నత అధికారుల వద్దకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు

పెదపాడు, జనవరి 1: 2024 ఆంగ్ల సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. నూతన సంవత్సర వేడుకల శుభాకాంక్షలు తెలుపుకుంటూ యువకులు గ్రామాల్లో సందడి చేశారు. అప్పనవీడులోని అభయాంజనేయస్వామి దేవాలయం, పెదపాడులోని గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయాలతో పాటు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, పెద్దసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, పెదపాడు, అప్పనవీడు, వట్లూరు ఆయా గ్రామాల్లో సొసైటీ అధ్యక్షులు అక్కినేని రాజశేఖర్, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్,


కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు


ఏలూరులో టీడీపీ నేత బడేటి చంటి


జనసేన పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుక


కె.జగ్గవరంలో కేక్ కట్ చేస్తున్న శ్రీరామమూర్తి

నగరంలో నూతన సంవత్సర సందడి

ఏలూరు క్రైం, జనవరి 1: జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకూ ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఏలూరు నగరంలో ఆదివారం రాత్రి యువత కేరింతలు కొడుతూ 2023కు వీడ్కోలు చెప్పి 2024కు స్వాగతం పలుకుతూ సంతోషాన్ని పంచుకున్నారు. బాణసంచా కాల్చుతూ, పుష్పగుచ్ఛాలు ఇస్తూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. నగరంలో ఆదివారం రాత్రి 12 గంటల వరకూ మద్యం షాపులు తెరచిఉన్నాయి. బార్లు కూడా 1 గంట వరకూ ఉండ డంతో మద్యం ప్రియులు పూటుగా మద్యాన్ని తాగారు. సోమవారం ఉదయం నగరంలో వివిధ శాఖల అధికారులు, ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఏలూరు నగరంలో సోమవారం ఉదయం పండుగ వాతావరణం తలపించింది. నగరంలో ఎవరి వద్ద చూసినా కేక్‌లు, పండ్లతో ఉన్న బుట్టలు, పూల బొకేలు కనిపించాయి. నూతన వస్త్రాలతో తమ వాహనాలు, జీపులు, కార్లతో హడావుడిగా కనిపించారు. మొత్తం మీద 2024 సంవత్సరంలో తమకు అంతా మంచే జరగాలని కోరుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.




ఏపీజేఏసీ–అమరావతి, ఏపీటీఎఫ్ డైరీలు, అపస్ కేలండర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్, డీఈవో

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల డైరీ, కేలండర్ల ఆవిష్కరణ

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 1: ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల కేలండర్లు, డైరీలను ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సోమవారం ఆవిష్కరించారు. ఏపీజేఏసీ అమరావతి జిల్లాశాఖ డైరీలు, కేలండర్‌లను కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, డీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు ఆవిష్కరించారు. జేఏసీ అమరావతి జిల్లాచైర్మన్ కె.రమేష్‌కుమార్, కార్యదర్శి ప్రమోద్‌కుమార్, నాయకులు రాంబాబు, యశ్వంత్, సుందరి, రవిచంద్ర, కృష్ణస్వామి, గీతిక తదితరులు పాల్గొన్నారు. ఏపీ ఉపాధ్యాయ సంఘం (అపస్) డైరీలను జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, డీఈవో శ్యాంసుందర్ ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేశ్వరరావు, కార్యదర్శి రాజ్‌కుమార్, జిల్లా నాయకులు సతీష్‌కుమార్, ఉపేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు. పీఆర్టీయూ కేలండర్లను జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో, డీఈవో ఆవిష్కరించగా సంఘ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఏపీ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) డైరీ, కేలండర్‌లను కలెక్టర్, ఎస్పీ, జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో, డీఈవో ఆవిష్కరించగా, సంఘ నాయకులు టి.రామారావు, రెడ్డి దొర, రంగావలీ, ప్రకాష్‌రావు, రమాదేవి పాల్గొన్నారు.

● పెదవేగి: సమగ్ర సమాచారం పొందుపర్చిన కేలండర్ ఎంతో ఉపయోగకరమని ఎంఈవో సీహెచ్.బుధవాస్ అన్నారు. 2024 ఏడాది యూటీఎఫ్ కేలండర్‌ను ఎంఈవో బుధవాస్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు టి.ఎడ్వర్డు, గౌరవాధ్యక్షుడు టి.ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి ఎం.లక్ష్మీనారాయణ, సభ్యులు వేణు, రాజేంద్ర, శ్రీను, కుమార్, నరేంద్ర, లక్ష్మణ్ పాల్గొన్నారు.

● చింతలపూడి: మండల విద్యా వనరుల కేంద్రంలో యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఎంఈవో కిరణ్‌బాబు ఆవిష్కరించారు. ముందుగా నూతన సంవత్సర కేక్ కట్ చేశారు. యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల భారీ ప్రదర్శన

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

ఏలూరు టూటౌన్, జనవరి 1: సమస్యలు పరిష్కరించాలంటూ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికుల సమ్మె సోమవారం కొనసాగింది. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలంటూ అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్షా ఉద్యోగులు పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పవర్‌పేట, ఫైర్‌స్టేషన్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని సమ్మె కొనసాగించారు. సీఐటీయూ నాయకులు సోమయ్య మాట్లాడుతూ వారం రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మిక సమస్యలు సానుకూలంగా పరిష్కరించాలన్నారు. సోమవారం ప్రభుత్వానికి కార్మిక నాయకులకు మధ్య జరిగిన చర్చల్లో ప్రభుత్వం కార్మికులకు హెల్త్ అలవెన్సులు 6వేలు పెంచేందుకు జీవో విడుదల చేసిందన్నారు. అన్ని సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. క్లాప్ ఆటోడ్రైవర్లు వంగాయిగూడెం వెహికల్ సెంటర్ వద్ద చేస్తున్న సమ్మె కొనసాగించారు. డ్రైవర్లకు, మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతుగా ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికులంతా మద్దతుగా సమ్మెలోకి ఆదివారం నుంచి వచ్చారు.

13వ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె


కలెక్టరేట్ వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

ఏలూరు కలెక్టరేట్, జనవరి 1: సమ్మెలో భాగంగా సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ వద్ద చెవులు, ముక్కు నోరు మూసుకుని నిరసన చేపట్టారు. సమ్మె 13వ రోజుకు చేరింది. నోటీసులతో తాము భయపడేది లేదని, ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, పాదయాత్ర సమయంలో జగన్ ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు భగవాన్, కమలాకర్, పౌల్‌రాజు, క్రాంతి, దిలీప్, బాలాజి, రాజు, చినబాబు, శ్రీనివాసరావు, వీరమణి, శ్యామల, ఝాన్సీ వెంకటలక్ష్మికుమారి, లక్ష్మీకాంతం, భవాని, తదితరులు పాల్గొన్నారు.


కుక్కునూరులో అంగన్వాడీల పొర్లు దండాలు


పోలవరం శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు


కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న మాగంటి బాబు


ద్వారకా తిరుమల తొలి మెట్టు వద్ద మొక్కుతున్న అంగన్వాడీలు

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో

సీఎం మొండి వైఖరి

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

అంగన్వాడీల సమ్మె రోజురోజుకు ఉధృతమవుతోంది. సమస్యల పరిష్కారంలో సీఎం మొండి వైఖరి విడనాడాలని నినాదాలు చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. కుక్కునూరులో అంగన్వాడీలు పొర్లు దండాలు పెట్టారు. ద్వారకా తిరుమలలో శ్రీవారి ఆలయ తొలిమెట్టు వద్ద కొబ్బరి కాయలు కొట్టి ప్రభుత్వానికి సద్బుద్ధి ప్రసాదించాలని స్వామి వారిని వేడుకున్నారు.

ఏలూరు కలెక్టరేట్, జనవరి 1: అంగన్‌వాడీ, మున్సిపల్, సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెపై సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలని కోరుతూ సోమవారం నగరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన నగర వీధుల గుండా సాగి కలెక్టరేట్ వద్దకు చేరుకుంది. జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గ్రాడ్యుటీ ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ.ప్రసాద్ మాట్లాడుతూ జనవరి 1న మహిళలు, ఉద్యోగులను రోడ్డుమీదకు తెచ్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు 21 రోజులుగా సమ్మె చేస్తున్నా జగన్‌ప్రభుత్వం దున్నపోతుమీద వర్షంపడినట్లుగా నటిస్తోందని మండిపడ్డారు.

మాజీ ఎంపీ మాగంటి బాబు మద్దతు

అంగన్‌వాడీల సమ్మెకు మాజీ ఎంపీ మాగంటి బాబు మద్దతు తెలిపారు. 21 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను అభినందించారు. జగన్ ప్రభుత్వం తక్షణం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు ముత్తారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, శ్రీరామ్మూర్తి, అంగన్‌వాడీ నాయకులు జయలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు పొర్లు దండాలతో నిరసన వ్యక్తం చేశారు. 21 రోజులుగా సమ్మె చేస్తున్నా సీఎం జగన్ ఏమాత్రం పట్టించుకోవడం లేదని సీఐటీయు మండల అధ్యక్షులు కుంజా నాగలక్ష్మి ఆరోపించారు. అంగన్‌వాడీలను క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకు దూరం చేసిన జగన్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించకుండా అరెస్టుల, నిర్బంధాలు ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాయి రమణ, బాడిస సుజాత, విజయ, సౌజన్య, మంగ, వరలక్ష్మి, కణితి మంగ తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని, ఈ ప్రజా ప్రతినిధుల కళ్లు తెరిపించి తమకు న్యాయం చేసేలా చూడు స్వామీ.. అంటూ అంగన్వాడీలు సోమవారం ద్వారకాతిరుమల చిన వెంకన్నను మొక్కుకున్నారు. ర్యాలీగా ఆలయ పాదుకా మండపం వద్దకు చేరుకుని తొలిమెట్టు వద్ద కొబ్బరికాయలు కొట్టారు. ఏడుకొండల వాడా.. వెంకటరమణా.. గోవిందా.. ప్రభుత్వానికి సద్బుద్ధి ప్రసాదించాలంటూ నినదించారు.

● చింతలపూడి: అంగన్‌వాడీల సమ్మె 21వ రోజుకు చేరగా మునిసిపల్ కార్మికుల సమ్మె ఏడవ రోజుకు చేరింది. ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్.నారాయణ అన్నారు. జనవరి 1న కూడా కార్యకర్తలు సమ్మె శిబిరాల్లో పాల్గొని నిరసన తెలిపారు. మంత్రి బొత్స సత్యనారాయణ కార్మికులను బెదిరిస్తున్నారని, సమ్మె విరమించ కుంటే కార్మికులను మార్చాల్సి వస్తుందని ప్రకటించడం అమానుషమన్నారు. కార్మికులు తలచుకుంటే ప్రభుత్వాన్నే మార్చే సత్తా ఉందని గ్రహించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 31న జరిపిన ఆటల పోటీల్లో విజేతలైన కార్యకర్తలకు సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ప్రాజెక్టు కార్యదర్శి టి.మాణిక్యం, జి.సరళ, హేమలత, పద్మ, చెన్నకేశరి, అరుణ, జి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: నూతన సంవత్సరం మొదటి రోజు అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. ప్రభుత్వం మొండివైఖరి విడనాడి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగొచ్చేవరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. కృపామణి, నూర్జహాన్, రామలక్ష్మి, శ్రీదేవి, రామయమ్మ, మున్నీ అంగనవాడీలు పాల్గొన్నారు.

● లింగపాలెం: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 21వ రోజుకు చేరుకుంది. సమ్మె చేస్తున్నా జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పుప్రకారం అందించవలసిన గ్రాడ్యుటీ రూ.5లక్షలు చెల్లించాలని కనీస వేతనం రూ.26 వేలు అందించాలని వారు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ నాయకులు టీజేఎన్.కుమారి, వి.ఈశ్వరి, మండలంలోని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: అంగన్వాడీ కార్యకర్తలు నూతన సంవత్సర వేడుకలు తహసీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసుకున్న దీక్ష శిబిరంలో నిర్వహించారు. కొత్త సంవత్సరంలోనైనా సీఎం జగన్ అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్.కొండలరావు, నాయకులు చోడెం జ్యోతి, పూర్ణావతి, ఊర్ల మణి, ఎస్తేరు, వరలక్ష్మి, జగదాంబ, భవాని, రాజేశ్వరి, బుచ్చమ్మ, రమాదేవి, ఉన్నారు.

● పోలవరం: అంగన్వాడీల సమ్మె శిబిరం వద్ద ప్రభుత్వ వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు శిబిరం వద్ద గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పద్మ, సరస్వతి, హైమవతి, కుబ్రా, జుబేద, వెంకటరమణ, సత్యవతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు యూటీఎఫ్ మద్దతు పలికింది. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మండల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఉనుముల రాంబాబు, డాకి జోగి అన్నారు. అంగన్వాడీ నాయకులు జి.రత్నం, యండ్రపాటి సుజాత, ఎం.శాంత కుమారి, ఝాన్సీ, సిరికి పద్మ తదితరులు నాయకత్వం వహించారు.

● కామవరపుకోట: జగన్ పాదయాత్రలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మె 21వ రోజుకు చేరుకుంది. నూతన సంవత్సరం మొదటి రోజు నిరసన ప్రదర్శన జరిపి అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకుని దీక్ష నిర్వహించారు. సీఎంకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వ్యాఖ్యానించారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ హోరెత్తించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సుభాషిణి, విజయ, శాంతి తదితరులు పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించబోమని స్పష్టం చేశారు.

సంక్షిప్త సమాచారం..

- **ఉంగుటూరు :** నారాయణపురం శివారులో సోమవారం చేబ్రోలు పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.1,00,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎ.మణికుమార్ తెలిపారు.
- ఉంగుటూరు మండలం చేబ్రోలు పోలీసులు కోడిపందేలపై సోమవారం దాడిచేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.730 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.
- **ఏలూరు రూరల్ :** వైఎంహెచ్ఏ, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాట్యం, పాటలు, ఏకపాత్రాభినయం ప్రదర్శనలు విశేషంగా అలరించాయి.
- సంఘ సేవకుడు విజయ్‌కుమార్ జైన్ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే ఆళ్లనాని అన్నారు. దివ్యాంగురాలికి వీల్‌చైర్‌ను సోమవారం అందజేశారు.
- **టి.నరసాపురం :** మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకుంటామని బొర్రంపాలెం మాజీ సర్పంచ్ పెండ్యాల మల్లిబాబు తనయుడు అభిషేక్‌బాబు తెలిపారు. బొర్రంపాలెంలో ఇటీవల తుఫాన్‌తో నష్టపోయిన 30 మంది మత్స్యకారులకు రూ.50 వేల విలువ చేసే పరికరాలు అందజేసినట్టు ఆయన తెలిపారు.
- టి.నరసాపురం మండలం బొర్రంపాలెంలో భగవాన్ శ్రీసత్య సాయి సేవ సంస్థ ఆధ్వర్యంలో పరసా శ్రీను, స్వాతి దంపతుల ఆర్థిక సహాయంతో 25 మంది వృద్ధులకు దుప్పట్లను, 15 మంది వృద్ధ మహిళలకు చీరలను ఎంపీటీసీ కలపర్తి సుజాత రామకృష్ణ పంపిణీ చేశారు. చావ వీర రాఘవులు, రామారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- **కొయ్యలగూడెం :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరికి స్పందన సంస్థ చేయూతనిచ్చింది. గవరవరం గ్రామానికి చెందిన తప్పెట్ల శ్రీనివాస్, పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామమైన కొత్తూరు గ్రామానికి చెందిన కంచుమర్తి శ్రీనివాస్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్పందన సంస్థ వ్యవస్థాపకుడు బలుసు నాగేశ్వరరావు రెండేళ్ల పాటు రూ.వెయ్యి చొప్పున పింఛన్ ఇస్తామని ప్రకటించారు. దీంతో వారిద్దరు స్పందన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్.ప్రవీన్‌కుమార్, రామ్మోహనరావు, జహంగీర్ పాల్గొన్నారు.


కైకలూరు టీడీపీ కార్యాలయంలో వేడుకలు


ముద్దరబోయినకు చాట్రాయి టీడీపీ నాయకుల శుభాకాంక్షలు


కాపాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు



వరహాపట్నంలో కామినేని శ్రీనివాస్‌కు పలువురి శుభాకాంక్షలు

కొత్త సంబరాలు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు .. ఆలయాలకు తరలిన భక్తులు.. చర్చిల్లో ప్రార్థనలు

ఆదివారం అర్ధరాత్రి నుంచి నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. యువత కేరింతలు కొడుతూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే సోమవారం ఉదయం నాయకుల ఇళ్ల వద్ద, ప్రభుత్వ కార్యాలయాల్లోను వేడుకలు ఘనంగా జరిపారు. భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి.

కైకలూరు, జనవరి 1: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. కైకలూరు శ్రీ శ్యామలాంబ ఆలయం, మీసాల వేంకటేశ్వరస్వామి, కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయాలకు భక్తులు వేకువజామున నుంచే తరలివెళ్లారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తన గృహంలో అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేశారు. నియోజకవర్గం నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నేతలు పెన్మెత్స త్రినాథరాజు, చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, నారగాని నాగేశ్వరరావు, వీజేఎస్ మాల్యాద్రి, బలే ఏసురాజు, వల్లభనేని శ్రీనివాస చౌదరి, తాడినాడ బాబు, పోలవరపు లక్ష్మీరాణి తదితరులు పాల్గొన్నా రు. టీడీపీ కార్యాలయంలో పెన్మెత్స వెంకటేశ్వరరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు ఇంటి వద్ద వేడుకలను ఘనంగా జరిపారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పార్టీ కార్యాలయంలో, ఎమ్మెల్సీ జయమంగళ తన ఇంటి వద్ద వేడుకలను నిర్వహించారు. జనసేనపార్టీ నాయకుడు బీవీ రావు పార్టీ కార్యాలయంలో వేడుకలు జరిపారు.

కలిదిండి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు కేక్ కట్ చేసి సిబ్బందికి పంపిణీ చేశారు. పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ ప్రియకుమార్ వేడుకలు జరిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని చౌదరి, నాయకులు కలిదిండిలో కేక్‌లు కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వరహాపట్నంలో మాజీ మంత్రి కామినేని నిర్వహించిన వేడుకలకు కలిదిండి నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఎంపీడీవో పి.మల్లీశ్వరి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించగా, వైస్ ఎంపీపీ రాచూరి రాధ, మండల పరిషత్ కార్యాలయ ఏవో రమణ బాబు, కలిదిండి ఏఎంసీ వైస్ ఛైర్మన్ బత్తిన కిషోర్, నాయకులు పాల్గొన్నారు. టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు వేడుకలు జరిపాయి. మాజీ ఎంపీ మాగంటి బాబును ఏలూరులోని ఆయన నివాసంలో ముదినేపల్లి మండలానికి చెందిన టీడీపీ నాయకులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, వీరమల్లు నరసింహారావు, కొత్తూరు విఠల్, చలసాని జగన్మోహనరావు, పరసా విశ్వేశ్వరరావు, బొంగు రవికుమార్ తదితరులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి కామినేనిని కూడా కలసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ముదినేపల్లి- కైకలూరు రోడ్డులోని రామాలయం, విఘ్నేశ్వర, భక్తాంజనేయ స్వామి ఆలయాల్లోను, అల్లూరు, పెదగొన్నూరులోని శివాలయాలు, చేవూరు లక్ష్మీనారాయణ స్వామి ఆలయాల్లో భక్తులు పూజలు జరిపారు. ముదినేపల్లిలోని ఆర్‌సీఎం చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించి ఫాదర్ మరియ కుమార్, విజయ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి చర్చిల్లో ప్రార్థనలు జరిపారు. సహాయ మాత ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ క్రిస్టి, ప్రిన్సిపాల్ లిన్సా వేడుకల్లో పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తును మార్చాలి : ముద్దరబోయిన

నూజివీడు, జనవరి 1: నూతన సంవత్సరం రాష్ట్ర భవిష్యత్తుకు పునాదులు వేసేలా గణనీయమైన మార్పులు తేవాలని నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన ఆకాంక్షించారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కొత్త సంవత్సరం వేడుకల్లో పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023ను రాష్ట్ర ప్రభుత్వం విధ్వంసకర సంవత్సరంగా మార్చిందని, అది గమనించిన ప్రజలు 2024లో ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పే విప్లవాత్మకమైన నిర్ణయాన్ని తీసుకుంటున్నారన్నారు.

సంక్షేమ యుగం ప్రారంభమవుతుంది : కాపా

నూతన సంవత్సరం చంద్రబాబు నాయకత్వంలో సంక్షేమ యుగం ప్రారంభం అవుతుందని నూజివీడు నియోజకవర్గ టీడీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు అన్నారు. తన కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. పలువురు టీడీపీ, జనసేన శ్రేణులు కాపాకు శుభాకాంక్షలు తెలిపారు.

నూజివీడు టౌన్: నూతన సంవత్సరం రాష్ట్ర ప్రజలకు సకల సౌభాగ్యాలు తీసుకురావాలని నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడులోని తన కార్యాలయంలో వేడుకలు నిర్వహించగా పలువురు అధికారులు, నూజివీడు, చాట్రాయి, ఆగిరిపల్లి, ముసునూరు మండలాల నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చాట్రాయి: మండలంలోని టీడీపీ శ్రేణులు నూజివీడు, ఏలూరు, భీమడోలు వెళ్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ మాగంటిబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులును కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సహకార యూనియన్ అధ్యక్షుడు దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎమ్మెల్యే ప్రతాప్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు మాజీ ఎమ్మెల్యే చిన్నంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ముసునూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండా దుర్గాభవానీ కేక్‌ను కట్ చేసి కొత్త సంవత్సరం ప్రజలకు సుఖ సంతోషాలను ఇవ్వాలని ఆకాంక్షించారు. ముసునూరు మండల టీడీపీ నాయకులు నూజివీడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొని ముద్దరబోయినకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చియ్య, తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి గద్దె రఘుబాబు, నియోజకవర్గ కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆగిరిపల్లి: సింగన్నగూడెం బస్టాప్ వద్ద గల బాబా మందిరంలో వేడుకలు ఘనంగా జరిగాయి. అర్చకులు దేవులపల్లి నరసింహమూర్తి అభిషేకాలు నిర్వహించారు. దాతలు వీరమాచనేని ఉమామహేశ్వరరావు, నాగమణి దంపతుల సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు.


ముదినేపల్లి ఆర్‌సీఎం చర్చికి విద్యుద్దీపాలంకరణ




కలిదిండిలో.. ముదినేపల్లి.. ముసునూరుల్లో ఎంపీపీల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు


నూజివీడులో కేక్ కట్‌చేసి వేడుకలు ప్రారంభిస్తున్న ముద్దరబోయిన

వేడుకల్లో విషాదం..

- నేల బావిలోకి దూసుకుపోయిన ద్విచక్ర వాహనం
- ఇద్దరి మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు
- కనసానపల్లిలో ఘటన
- మృతులది కృష్ణాజిల్లా


మృతదేహాల వద్ద బంధువుల రోదనలు

ఆగిరిపల్లి, జనవరి 1: నూతన సంవత్సరం వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. చేతికందివచ్చిన కుమారులు నేలబావికి బలవడంతో ఆ యువకుల తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. విజయవాడలోని నున్నకు చెందిన శెట్టి సాయికుమార్, నున్న రాకేష్ స్నేహితులు. నూతన సంవత్సరం సందర్భంగా రాకేష్ సమీప బంధువు అయిన ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం కనసానపల్లికి చెందిన ఓ వ్యక్తి మామిడితోటలో వేడుకలు జరుపుకునేందుకు తమతో పాటు విజయవాడ మొగల్రాజపురానికి చెందిన తలశిల కృష్ణచైతన్యను తీసుకువెళ్లారు. పార్టీ అనంతరం సోమవారం ఉదయం ఇళ్లకు బయల్దేరారు. ఈ క్రమంలో బుల్లెట్‌పై వెళుతున్న వీరికి గేదెలు అడ్డురావడంతో పక్కకు వెళ్లేప్రయత్నంలో నేరుగా నేలబావిలోకి వీరి బైక్ దూసుకుపోయింది. పార్టీలో పాల్గొని వీరి వెనుకే వస్తున్న మరో ఇద్దరు ఈ సంఘటనను చూసి ఆ పక్కనే పొలంలో పనిచేస్తున్న వారికి సమాచారం ఇవ్వడంతో వారు ఓ కర్ర సాయంతో నున్న రాకేష్‌ను బావి నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తలశిల కృష్ణచైతన్య (24), శెట్టి సాయికుమార్ (24) బావిలోనే మునిగి మృతి చెందారు. రైతులు నేలబావిలోకి దిగి వీరిలో ఒకరిని బయటకు తీయగా, అతను అప్పటికే మృతి చెందాడు. సంఘటనపై కనసానపల్లి సర్పంచ్ సంజయ్ ఆగిరిపల్లి పోలీసులకు సమాచారమివ్వగా పోలీసులు నేలబావి నుంచి నీటిని బయటకు తోడించి మృతదేహాన్ని, బుల్లెట్ వాహనాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం వీరి మృతదేహాలను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఎస్సై చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇప్పుడిప్పుడే ఉద్యోగాల్లో స్థిరపడుతూ...

నేలబావిలో పడి మృతి చెందిన శెట్టి సాయికుమార్, తలశిల కృష్ణచైతన్య ఇప్పుడిప్పుడే ఉద్యోగాల్లో స్థిరపడుతూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. సాయికుమార్ విజయవాడలోని అను మైబేబీ హాస్పిటల్లో ఫార్మసీ సూపర్ వైజర్‌గా పనిచేస్తూ తండ్రి రంగారావుకు ఆసరాగా నిలుస్తున్నాడు. తలశిల కృష్ణచైతన్య కార్డ్ బోర్డు కంపెనీలో ఉద్యోగంలో చేరి కుటుంబానికి ఆసరాగా నిలిచాడు. వీరిని నేలబావి పొట్టన పెట్టుకోవడంతో బంధువుల రోదనలు చూపరులను కన్నీరు పెట్టించాయి. అయితే తోటల్లో నుంచి వచ్చే రహదారి సరిగ్గా ఈ నేలబావి వద్దే కొద్దిగా మలుపు తిరగటం కూడా ఈ ప్రమాదానికి కారణమైందని, రాత్రిపూట పార్టీలు వద్దన్నా స్నేహితులంతా కలసి కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలకాలని వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారంటూ ఆ తల్లిదండ్రుల ఆవేదన పలువుర్ని కలచివేసింది.


మండవల్లి నుంచి విజయవాడ పాదయాత్రగా భవానీలు

పాదయాత్రగా విజయవాడకు భవానీలు

మండవల్లి, జనవరి 1: మండవల్లి గ్రామంలో భవానీ మాలధారుల ఇరుముడి సోమవారం ఘనంగా జరిగింది. గురు భవానీలు భోగేశ్వరరావు, అశోకచక్రవర్తి ఆధ్వర్యంలో జాతీయ రహదారి పక్కన ఉన్న షిర్డిసాయి మందిరంలో 25 మంది మాలధారులు ఇరుముడులు ధరించి పాదయాత్రగా విజయవాడ దుర్గమ్మ ఆలయానికి బయలుదేరారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



కైకలూరు, జనవరి 1: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం కైకలూరులో ప్రారంభించారు. 150 మంది రామభక్తులు మేళతాళాలతో స్వామివారి చిత్రపటాలను ఊరేగింపుగా తీసుకువెళుతూ ఇంటింటికి వెళ్లి అక్షతలను అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు దంపతులకు కైకలూరు శ్రీరామకృష్ణ సేవాసమితి సభ్యులు, రామభక్తులు అందజేశారు. ఇంటింటా ప్రజలు అక్షతలను తీసుకునేందుకు ముందుకు వచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అక్షతల పంపిణీ జరుగుతుందని సేవాసమితి సభ్యులు తెలిపారు.


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న బీకేఎం నాని దంపతులు

పేదలకు దుస్తుల వితరణ

కైకలూరు, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా టీడీపీ నాయకుడు బీకేఎం నాని, ఆయన సతీమణి, జడ్పీటీసీ మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి పేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. సోమవారం అటపాకలోని తమ ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి పేదలకు దుస్తులను అందజేశారు. టీడీపీ అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి వారికి శుభాకాంక్షలను తెలియజేశారు.

మరింత ఉన్నత సేవలందించాలి : ఎస్పీ

ఏలూరు క్రైం : నూతన సంవత్సరాన్ని పురస్కరించు కుని జిల్లా పోలీస్ కార్యాల యంలో ఎస్పీ మేరీ ప్రశాంతి సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ 2023 సంవత్సరంలో పోలీస్ సిబ్బంది సాధించిన ప్రగతి కంటే ఉన్నతమైన సేవలను ప్రజలకు అందించాలన్నారు.

శోభనాచలుని సేవలో ఎమ్మెల్యే

ఆగిరిపల్లి, జనవరి 1: ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామిని సోమవారం నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్‌అప్పారావు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ ఆగిరిపల్లి మండల అధ్యక్షుడు నరసింహారావు, జడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నూజివీడు టౌన్, జనవరి 1: నూజివీడు నియోజకవర్గ టీడీపీ నాయకుడు నూతక్కి వేణుగోపాలరావు యూటీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఆయనను కలిసిన యూటీఎఫ్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆయన ఆవిష్కరించారు. జనసేన, టీడీపీ కార్యకర్తలు, నాయకులు వేణుకు శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబానికి అట్లూరి ట్రస్ట్ చేయూత



ముసునూరు, జనవరి 1: లోపూడి లో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో సగర కాలనీకి చెందిన కటారి నరసింహా రావు ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో బాధితులను అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర సోమవారం పరామర్శించి రూ.5 వేల సరుకులు, సామగ్రి, దుస్తులు, రూ.5 వేలు నగదును అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయాన్ని తక్షణమే అందజేయాలని కోరారు.


వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నూతన కమిటీ

కైకలూరు, జనవరి 1: కైకలూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నూతన కమిటీ ఛైర్మన్‌గా టేకి వెంకట సత్యనారాయణ నియమితు లయ్యారు. సోమవారం ఆలయంలో నియోజకవర్గ అధ్యక్షుడు తుపాకుల సోమా చారి, సింహాద్రి రామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఎన్నో ఏళ్లుగా ఆలయం వేరే వ్యక్తుల చేతుల్లో ఉండేదని ఎమ్మెల్యే సహకారంతో ఆలయాన్ని విశ్వబ్రాహ్మణ సంఘానికి అప్పగించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో 21 మంది కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వైస్ ఛైర్మన్‌గా టేకి నాగలింగాచారి, సెక్రటరీగా సింహాద్రి రాంబాబు, కోశాధికారిగా అనుపోజు నాగేశ్వరరావుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఉజ్వల పథకాన్ని వినియోగించుకోవాలి

ముసునూరు, జనవరి 1: కేంద్రం అమలు చేస్తున్న పీఎం ఉజ్వల పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు చక్రవర్తి అన్నారు. సోమవారం ముసునూరు సచివాలయం వద్ద వికసిత భారత్ సంకల్ప యాత్ర సభను ఎంపీడీవో జి.రాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆముదాల ఇస్సాకు తదితరులు ఉజ్వల పథకం కింద మహిళలకు గ్యాస్ కనెక్షన్ల పంపిణీని ప్రారంభించారు. ఓబీసీ జిల్లా ప్రెసిడెంట్ కంచర్ల రాంబాబు, మండల అధ్యక్షులు అనగాని రాంబాబు, ఉపాధ్యక్షులు గుడిమెళ్ళ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హతుడి గుర్తింపు

ఏలూరు క్రైం, జనవరి 1 : ఏలూరు నగరంలో పాత బస్టాండ్ సమీపంలో డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి జరిగిన హత్య కేసులో మృతుడిని గుర్తించారు. ఏలూరు కత్తేపువీధి ప్రాంతానికి చెందిన ఒడ్డిగళ్ళ మధు (30) బార్బర్ పని చేస్తూ జీవిస్తున్నాడు. అతని భార్యతో గొడవ జరిగి ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్నాడు. ఏలూరు బావిశెట్టివారిపేటనకు చెందిన పెయింటర్ కనుమటి హరికుమార్ (35)తో అప్పుడప్పుడు కలిసి మద్యం తాగుతూ ఉంటాడు. వీరిద్దరు యథావిధిగా డిసెంబరు 31 రాత్రి ఏలూరు పాతబస్టాండ్ సమీపం లోని ఒక బార్‌లోకి వెళ్లి మద్యం తాగుతూ ఉండగా వారి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో ప్రణాళిక ప్రకారం హరికుమార్ ఒక చాకును తెచ్చుకుని ఇంటికి వెళ్తున్న మధుపై దాడి చేసి హతమార్చాడు. ఈ ఘటనపై టూటౌన్ సీఐ ప్రభాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ముసునూరు, జనవరి 1: కడుపునొప్పి భరించలేక ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉదంతమిది. ఎస్సై ఎం.కుటుంబరావు వివరాల ప్రకారం మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన అమర్తల రవి అనే యువకుడు కొంతకాలంగా కడుపునొప్పితో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం రాత్రి తట్టుకోలేని విధంగా నొప్పి రావడంతో ఇంట్లో ఉన్న కలుపుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబీకులు అతనిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం



ముదినేపల్లి, జనవరి 1 : ముదినేపల్లి మండలం పెయ్యేరు శివారు అప్పారావుపేటలో ఆదివారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో ఓ తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధం కాగా, తల్లీ కొడుకులు ప్రాణాలతో బయటపడ్డారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం సంభవించినట్టు భావిస్తున్నారు. బాధితురాలు పరసా సీతారావమ్మ ఇంటిలో ఇంట్లోని సామగ్రి దగ్ధం కావటంతో సుమారు లక్ష రూపాయల మేర ఆస్తినష్టం జరిగింది. సోమవారం ఉదయం బాధితులను టీడీపీ నాయకులు కొడాలి వినోద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ పరామర్శించి ఆర్థిక సాయమందించారు. అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి కూడా రూ.5 వేలు నగదు, నిత్యావసర సరుకులను తన తండ్రి ద్వారా బాధితులకు అందజేసింది.








నూజివీడు, కైకలూరులో కేక్ కట్ చేసి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు.. చాట్రాయి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన.. మండవల్లిలో కేక్ అందజేస్తున్న టీడీపీ నాయకులు.. ఆగిరిపల్లిలో పర్వతనేని ఆధ్వర్యంలో కేక్ పంపిణీ

సీఎంకు కనువిప్పు కలగాలి

నూతన సంవత్సర వేడుకల్లో అంగన్వాడీల ఆకాంక్ష.. 21వ రోజుకు దీక్షలు

కైకలూరు, జనవరి 1: నూతన సంవత్సరం ప్రారంభం రోజునా అంగన్వాడీలు తమ పోరాటాన్ని కొనసాగించారు. సోమవారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. శిబిరంలోని కేక్ కట్ చేసి కొత్త సంవత్సరంలోనైనా సీఎంకు కనువిప్పు కలగాలని కోరుకున్నారు. వీరికి టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు తదితర నాయకులు కేక్‌ను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పి. సుజాత, విజిత, ఎల్. మీనాకుమారి, ఉష తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగులు సోమవారం ఎర్రటి దుస్తులు ధరించి నిరసన తెలిపారు. స్థానిక మండల కార్యాలయాల ఆవరణ వద్ద దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు ఆటలు ఆడారు. ఉద్యోగుల యూనియన్ నాయకులు అరుణ కుమారి, పద్మ, మణి తదితరుల ఆధ్వర్యంలో ఆటల పోటీలు జరిపారు.

కలిదిండి: కలిదిండిలో అంగన్‌వాడీల 21వ రోజు సమ్మెకు జడ్పీటీసీ మాజీ సభ్యురాలు నున్న రమాదేవి, టీడీపీ నాయకులు భద్రాజు ఏసుబాబు, బోడావుల రాము, నున్న సుబ్రహ్మణ్యంలు మద్దతు తెలిపారు. సోమవారం వారికి కేక్‌ను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెలో అంగన్‌వాడీ నేతలు అబిదా బేగం, రమాదేవి, విజయ, కుమారి, రామలక్ష్మి పాల్గొన్నారు.

మండవల్లి: అంగన్వాడీలు దీక్షా శిబిరం వద్ద తెలుగుదేశంపార్టీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. టీడీపీ మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, నాయకులు అంగన్వాడీలకు కేక్‌ను అందజేశారు.

నూతన సంవత్సరం తమ తల రాతలు మార్చాలంటూ..

నూజివీడు: నూతన సంవత్సరం తమ తలరాతలు మార్చేదిగా ఉండాలని అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులు దీక్షా శిబిరాల వద్దే కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. ఎన్నికలకు ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ సమ్మెబాట పట్టిన అంగన్ వాడీలు, మున్సిపల్ కార్మికులు దీక్షలను యథావిధిగా కొనసాగించారు. సీఐటీ యూ అధ్యక్ష, కార్యదర్శులు హనుమాన్లు, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

ముసునూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తుండటం జగన్‌రెడ్డికి వెన్నతోపెట్టిన విద్య అని టీడీపీ నాయకుడు మానం విజయ్‌కుమార్ విమర్శించారు. ముసునూరు సచివాలయం వద్ద అంగన్‌వాడీల 21వ రోజు దీక్షలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి పి.రాజకుమారి, మండల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన దీక్షకు నూజివీడు నియోజకవర్గ టీడీపీ నాయకుడు పర్వతనేని గంగాధర్ సూచనలతో పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, పార్టీ ఈదర నాయకులు దొండపాటి ఏసుపాదం, శోభనాపురం నాయకులు నక్కనబోయిన వేణు, నలజాల హరిబాబు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆరేపల్లి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు గంగాధర్ పంపిన స్వీట్లు అందజేశారు.

చాట్రాయి: సర్కార్ దిగివచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు విజయ, ప్రమీల, నిర్మల, జ్యోతి స్పష్టం చేశారు. చాట్రాయి తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్షను కొనసాగించారు.